ప్రజాశక్తి
సోమవారం 3 ఫిబ్రవరి 2025 5
అనంతపురం





బడ్జెట్‌కు వ్యతిరేకంగా అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

మరోసారి కేంద్రం మోసం

◆ బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం ◆ సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ సారి కూడా ఆంధ్ర ప్రదేశ్‌కు అన్యాయం చేస్తూ మొండి చెయ్యి చూపిందని సిపిఎం నాయకులు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తగిన కేటాయింపులు చేయకపోవడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం టవర్‌క్లాక్ వద్ద నిరసన తెలిపారు. బడ్జెట్ ప్రతులను దహనం చేసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ముత్తుజ మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు ఈ బడ్జెట్‌లో ఎటువంటి నిధులూ కేటాయించలేదన్నారు. అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు కేటాయింపు లేదన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్ ఖండ్ తరహా నిధులు ఇస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. కేంద్రం పన్నుల్లో ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన రూ.57వేల కోట్లను కూడా ఇవ్వలేని విమర్శించారు. ఆంధ్ర రాష్ట్రం ఎంపిల మద్దతుపై కేంద్ర ప్రభుత్వం నడుతస్తున్నా నిధులను విడుదల చేయించుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి అప్పులు కాదని, సొంత గనులని తెలిసి కూడా అందుకు అవసరమైన చర్యలపై కేంద్రం ఎలాంటి ప్రకటనా చేయకపోవడం దుర్మార్గం అన్నారు. నిధులు రాకున్నా బడ్జెట్ బాగుందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కితాబు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వలీ, మసూద్, గోపాల్, వెంకటేశు, బుల్లే రాజు, ఓబులేసు, లతీపు, నూరుల్లా, అజాం, షరీఫ్, హాజీవలి, ఇస్మాయిల్, శంషాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో బంగారాన్ని పండించే పంట పొలాలను భూసేకరణతో రైతుల నుంచి లాక్కొని బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టారు. ఇలా తీసుకున్న భూముల్లో హిందూపురం రూరల్ మండలం తుమకుంట, గోళ్లపురం ప్రాంతాల్లో రసాయనిక పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఈ పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు ఆ ప్రాంతాన్ని కాలుష్యం కాటుకు గురి చేస్తున్నాయి. రసాయన వ్యర్థాలను పారిశ్రామిక వాడలోనే గుంతలు తీసి పడేస్తున్నారు. ఈ వ్యర్థాలు భూమిలో కలిసి జలకాలుష్యం అవుతోంది. బయట వాయు కాలుష్యం చేస్తున్నాయి. దీంతో పాటు పరిశ్రమలు చిమ్మే విషవాయువును పీల్చి ప్రజలు రోగాల భారీన పడుతున్నారు. సాగుతో కళకళలాడే సమీప పంట పొలాలు బీళ్లుగా మారుతున్నాయి.



భూమిలో చిన్నపాటి గుంత తీసి వేసిన రసాయన వ్యర్థాలు



పారిశ్రామిక వాడ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన భూమిపై రసాయన వ్యర్థాలతో ఏర్పడిన కాలుష్యం

కాలుష్యం కాటు..!

◆ భూమిలోకి రసాయన పరిశ్రమల వ్యర్థాలు

◆ కాలుష్యం కోరల్లో పారిశ్రామిక వాడ, సమీప గ్రామాలు

◆ విషవాయులతో పంట కాలుష్యం, రోగాల భారిన ప్రజలు

◆ ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోని కాలుష్య నియంత్రణ శాఖ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తుమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడతోపాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలు కాలుష్యం కోరల్లో కూరుకుపోయాయి. కెమికల్ పరిశ్రమలు, స్టీల్ పరిశ్రమలు వెదజల్లే పొగ, దుర్వాసనకు పారిశ్రామిక వాడ పరిధిలోని గోళాపురం, గుడ్డంపల్లి, దేవరపల్లి తదితర గ్రామ ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. పరిశ్రమల నుంచి వచ్చే పొగలు మేఘాలను తలపిస్తుంటాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రాంతంలో వాహనాలు నడపడానికి సైతం రోడ్డు కనబడక వాహనదారులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుంది. పారిశ్రామిక వాడ సమీపంలో నివసించే గ్రామాల ప్రజలు శ్వాశకోశ, చర్మవ్యాధులతో అల్లాడిపోతున్నారు. రసాయన పరిశ్రమల వ్యర్థాలను భూముల్లోకి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. ఇవి భూమిలో ఇంకి భూ గర్భజలాలు కలుషితం అవుతున్నాయి. రసాయనాల ప్రభావంతో ఈ ప్రాంతంలో నివసించే వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. గతంలో మంచి పంటలు పండే భూములు కూడా ప్రస్తుతం నిస్సారం అయ్యి బీడుగా మారాయి. పరిశ్రమల సమీప ప్రాంతాల్లో కేవలం మొక్కజొన్న పంటను మాత్రమే సాగుచేసుకునే పరస్థితి ఉంది. ఈ ప్రాంతానికి అతిపెద్ద ఆధారంగా నిలిచిన పట్టుపరిశ్రమ కాలుష్యం దెబ్బతో చితికిపోయింది. ఇటు పరిశ్రమల్లో ఉపాధి లభించక అటు వ్యవసాయ భూములు లేక ఈ ప్రాంతవాసులు అన్ని విధాలా నష్టపోయారు. పరిశ్రమలను నుంచి వచ్చే వ్యర్థాలను బయటకు తరలించకుండా పారిశ్రామిక వాడలోనే గుంతలు తీసి అందులో పడేస్తున్నారు. దీంతో పాటు రైల్వే ట్రాక్ పక్కన సైతం వేస్తున్నారు. ఈ వ్యర్థాల వేడి వల్ల భూమి కంపించి రైల్వే ట్రాక్ ఏ క్షణంలో నైనా ట్రాక్ పక్కకు వాలే అవకాశాలు ఉన్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల వ్యర్థాలు వదిలిన ప్రాంతాన్ని పరిశీలన చేస్తున్న కాలుష్య మండలి అధికారులు (ఫైల్ ఫోటో)

భూమిపైనే రసయాన వ్యర్థలు

తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసినా ఉక్కు, రసాయన పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను చుట్టు పక్కల పారేస్తున్నారు. పారిశ్రామిక వాడలో 8 రసాయన, 22 వరకు స్టీల్ పరిశ్రమలున్నాయి. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు భూమిలోపల సుమారు 50 అడుగుల లోపలకు వేసి పూడ్చాలి. పరిశ్రమ యాజమాన్యాలు ఇలా చేయడం లేదు. ప్రజాప్రతినిధులే ఏజెంట్లుగా మారి పరిశ్రమల నుంచి వచ్చిన వ్యర్థాన్ని ప్రత్యేక ట్యాంకర్లు ఏర్పాటు చేసి జన నివాసం లేని ప్రాంతాల్లో ఆరుబయటనే వేస్తున్నారు. ఇలా రసాయనం వేసిన ప్రాంతంలో ఒక పిచ్చిమొక్క కుడా మొలవని పరిస్థితి ఏర్పడుతోంది. కొన్ని పరిశ్రమలు ఏకంగా రసాయన వ్యర్థాలను చిన్న కాలువలు చేసి మురుగు నీటి కాలువలోకి వదిలేస్తున్నారు. దీనిని అధికారులెవరూ ప్రశ్నించకపోవడంతో పరిశ్రమల యజమానులు యథేచ్ఛగా జనావాసంలోకి రసాయనాలను వదిలేస్తున్నారు.

చర్యలు శూన్యం

తూమకుంట, గోళ్లపురం పారిశ్రామిక వాడ పరిశ్రమల వల్ల పర్యావరణం దెబ్బ తిని కాలుష్యం ఏర్పడింది. పారిశ్రామిక వాడ చుట్టుపక్కల ఉన్న గ్రామలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి భూమిపై చిన్నపాటి గుంతతీసి అందులో వేస్తున్నారు. ఇది ప్రజలకు అత్యంత ప్రమాదామని, దీనిని నియంత్రించాలని కాలుష్య నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన లేదు. పరిశీలనతోనే అధికారులు కాలం గడిపేస్తున్నారు. అధికారులు చర్యలకు ఉపక్రమించకుంటే పారిశ్రామిక వాడ సమీప గ్రామీణుల కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేపడతాం.

రవికుమార్,
అధ్యక్షులు తూమకుంట పారిశ్రామిక వాడ.

అంగన్‌వాడీకి భవనం కరువు..!



నాగిరెడ్డిపల్లిలో శిథిలాస్థకు చేరిన మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని చూపుతున్న సర్పంచి, అంగన్‌వాడీ సిబ్బంది

◆ ఆర్డీటీలోనే రెండు కేంద్రాల నిర్వహణ

◆ అక్కడికి వెళ్లాలంటే అర కిలోమీటర్ నడవాల్సిందే..

◆ నాగిరెడ్డిపల్లి గ్రామంలో గర్భిణులు, చిన్నారుల అవస్థలు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి అంగనవాడీ సెంటర్‌కు సొంత భవనం లేదు. ఆర్డీటీ భవనంలో మెయిన్, మినీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. మెయిన్ సెంటర్‌లో గర్భిణులు ఏడుగురు, బాలింతలు ఏడుగురు, కిశోర బాలికలు 35 మంది, ప్రీస్కూల్ విద్యార్థులు 70 మంది ఉన్నారు. 12 ఏళ్ల కిందట అద్దె భవనంలో అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తుండేవారు. ఆ భవనం శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉండడంతో ఆర్డీటీ కేంద్రంలోకి మార్చారు. ఇక నాగిరెడ్డిపల్లి గ్రామం (కొత్తూరు)లో మినీ అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. ఈ కేంద్రం పరిధిలో ఐదుగురు గర్భిణులు, ఐదుగురు బాలింతలు, పదిమంది కిశోర బాలికలు, 60 మంది ప్రీస్కూల్ చిన్నారులు ఉన్నారు. ఇది కూడా శిథిలావస్థకు చేరడంతో నాలుగేళ్ల కిందట ఈ కేంద్రాన్నీ ఆర్డీటీ భవనంలోకి మార్చారు. ఈ కేంద్రాలకు కొత్త భవనాల మంజూరుపై జిల్లా అధికారులు దృష్టి సారించలేదు. ప్రస్తుతం ఆర్డీటీలో నిర్వహిస్తున్న కేంద్రాలు గ్రామానికి అర కిలోమీటర్ దూరంలో ఉన్నాయి. ఇంత దూరం ప్రతి రోజూ గర్భిణులు, చిన్నారులు నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించాలని సర్పంచి సందీప్ కుమార్ పలుమార్లు అధికారులను కలిసి విజ్ఞాపనలు చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. అయినా కొత్త భవనం నిర్మాణానికి అనుమతులు రాలేదు. ఈ విషయంపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజినమ్మ, ఖాసింబీలు మాట్లాడుతూ నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణం మంజూరు నిమిత్తం జిల్లా కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని చెబుతున్నారు. పిల్లలు, గర్భిణులకు అత్యవసరమైన అంగన్‌వాడీ కేంద్రంకు సొంత భవనాన్ని గ్రామంలో నిర్మించి అందులో నిర్వహించాలని నాగిరెడ్డిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి ఇలా..

మండల వ్యాప్తంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో వేపులపర్తి, బ్రహ్మసముద్రం రెండు సెక్టార్లు ఉన్నాయి. ఈ సెక్టార్లలో 46 మెయిన్ కేంద్రాలు, 11 మినీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో చిన్నారులు 3307, గర్భిణులు 380, బాలింతలు 364, కిశోర బాలికలు 2130తో కలిసి మొత్తం 6181 మంది ఉన్నట్లు అంగన్‌వాడీ రికార్డులు చెబుతున్నాయి. మండల వ్యాప్తంగా 57 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి 30 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 27 కేంద్రాలకు భవనాలు లేవు. ఇందులో అద్దె భవనాలు 9, ఉచిత భవనాలు 18 ఉన్నాయి. సొంత భవనాలు లేని కేంద్రాల్లో సరైన వతులు లేక పిల్లలు, గర్భిణులు, అంగన్‌వాడీ సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కేసులు, బెదిరింపులకు ఎవరూ భయపడొద్దు - వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యువజన విభాగం నాయకులు కీలకపాత్ర పోషించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపుని చ్చారు. ఆదివారం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస కళ్యాణ మండపంలో వైసిపి యువజన విభాగం నేతల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పార్టీ బలోపేతంపై వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు యువజన విభాగం ఎలాంటి పాత్ర పోషించిందో.. అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. వైసిపి హయాంలో గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా మేనిఫెస్టోను అమలు చేశామని గుర్తుచేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు అవుతున్నా ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోరాటాలు చేయడానికి ఎవరూ భయపడొద్దని తెలిపారు. అధికార పార్టీ నేతల బెదిరింపులు, అక్రమ కేసులపై కలిసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. మనలో ఎవరికి ఇబ్బంది వచ్చినా వైసిపి ముందుంటుందన్నారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకుని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఒక రాజకీయ పార్టీగా వైసిపి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షానే నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇప్పటికే రైతు సమస్యలు, విద్యుత్ ఛార్జీల పెంపుపై పెద్దఎత్తున ఆందోళనలు చేశామని, ఎవరూ ఊహించని విధంగా స్పందన వచ్చిందన్నారు. ఫిబ్రవరి 5న విద్యార్థుల సమస్యలపై నిర్వహించే 'ఫీజు పోరు'కు పెద్దఎత్తున యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. యువజన విభాగం నాయకులు కళాశాలలకు వెళ్లి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను తెలియజేయాలన్నారు. వైసిపి యువజన విభాగం అనంతపురం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటబాట పడదామని పిలుపునిచ్చారు. అన్ని నియోజకవర్గాల్లో యువజన విభాగం కమిటీలు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను, కూటమి నేతలు ఇచ్చిన వాగ్దానాలను గుర్తు చేస్తూ ఆందోళన చేయడానికి సిద్ధం కావాలన్నారు. అనంతరం ఫీజుపోరుకు సంబంధించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులు శ్రీనివాస్ దత్తా, అబ్దుల్‌బషీద్, తలారి చరణ్, రవి, వైసిపి యువజన విభాగం నాయకులు సురేష్, లోకనాథ్‌రెడ్డి, బుల్లే జగదీష్, వినీత్, మణికంఠ రాయల్, కిరణ్, చంద్రశేఖర్, బిల్లే నాగార్జున, మైను, సాకే కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాదర్బార్'లో వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న మంత్రి

ఉరవకొండ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంతోపాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తరలివచ్చి వినతులను అందించారు. ఆయా వినతులను స్వీకరించినా మంత్రి వాటిని పరిశీలించి పరిష్కారానికి చొరవ చూపుతామని భరోసా ఇచ్చారు.

సమాజ మార్పునకు సహకారం

◆ ఫెర్రర్ స్ఫూర్తితో ముందడుగు

◆ ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డా॥వైవి.మల్లారెడ్డి

◆ 'ప్రజాశక్తి'తో స్వచ్ఛంద సేవారంగంలో 50 ఏళ్లు అనుభవాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి


'యాభై ఏళ్లుగా స్వచ్ఛంద సేవా రంగంలో ఉంటూ సమాజ మార్పులో నా వంతు కృషి చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది' అని ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవి.మల్లారెడ్డి పేర్కొన్నారు. నిత్యం కరువులకు నిలయమైన అనంతపురం జిల్లాలో కరువు కాటకాలు, దారిద్ర్యం నుంచి ప్రజలను కాపాడే విషయంలో ప్రభుత్వాలతోపాటు స్వచ్ఛంద సంస్థల కృషి ఉంది. ఈ కృషిలో సుదీర్ఘకాలం పనిచేసిన వ్యక్తుల్లో డాక్టర్ వైవి.మల్లారెడ్డి ఒకరు. ఆయన ఈ రంగంలో పనిచేస్తూ 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన అనుభవాలను 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేశారు.

ప్ర : సుదీర్ఘ జీవన ప్రయాణంలో మీరు గమనించిన గ్రామీణ ప్రజాజీవనం మార్పు ఏ రకంగా ఉంది ?

వైవి : 1970 దశకంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో కటిక దారిద్ర్యం తాండవిస్తూ ఉండేది. తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా కష్టమైన రోజులు ఆనాడు ఉండేవి. ప్రజల్లో చైతన్యం చాలా తక్కువగా ఉండేది. ప్రధానంగా దళిత, గిరిజనుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. నిరక్షరాస్యత అధికం. ఆనాటి పరిస్థితుల నుంచి ఇప్పటికి చూస్తే పెద్ద మార్పే సమాజంలో జరిగిందని చెప్పవచ్చు. ఇందులో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థల కృషి ఎంతగానో ఉంది. అక్షరాస్యత అందరిలోనూ ఇప్పుడు పెరిగింది. తద్వార ప్రజల్లో చైత్యం పెరిగింది.

ప్ర : గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా రైతు ఆత్మహత్యలు కొనసాగుతూ ఉండటానికి గల కారణాలు ఏమిటి.?

వైవి : వ్యవసాయంలో వచ్చిన మార్పులే రైతు ఆత్మహత్యలకు కారణమని చెప్పవచ్చు. 1975 ముందు వరకు జిల్లాలో వ్యవసాయం ఆహర ఉత్పత్తి ఆధారంగా ఉంటూ వచ్చింది. వేరుశనగ సాగు 1980లో ప్రారంభమైంది. అప్పటి నుంచి వ్యవసాయ విధానంలోనూ మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి. ఆహార ధాన్యల ఉత్పత్తి కాకుండా వాణిజ్యపంటల వైపు మొగ్గుచూపడం, ప్రభుత్వాలూ అటువైపు ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఇది ఎప్పుడు పెరిగిందో అప్పుడు రైతుపై ఆర్థికపరమైన భారం పడుతూ వచ్చింది. ఇదే సమయంలో వర్షాభావ పరిస్థితులు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి వాటితో రైతులు రుణాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల వైపునకు దారితీసింది. రుణభారాల్లో అత్యధికంగా వ్యవసాయ బోర్లు కూడా ఉన్నాయి. సాగునీటి కోసం బోర్లపైన బోర్లు వేసి రుణభారాల్లో కూరుకు పోవడం ఆత్మహత్యల ఓకారణం అయ్యింది.



ప్ర : ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోవడం ద్వారా రైతు ఆత్మహత్యలను నివారించవచ్చు ?

వైవి : రైతు ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యల్లో ప్రధానమైనది గిట్టుబాటు ధర కల్పించాలి. పంటలబీమా విధానంలో రైతుకు మరింత ప్రయోజనం చేకూరే విధానాన్ని తీసుకురావాలి. ఇప్పుడున్న పంటల సాగు విధానం కాకుండా ప్రకృతి ఆధారంగా పంటలసాగును ప్రోత్సహించాలి. వారిపై పడుతున్న ఆర్థికభారాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి. మెట్ట వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది.

ప్ర : మీ యాభై ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో జిల్లా అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఏ మేరకుంది ?

వైవి : జిల్లా అభివృద్ధిలో ప్రభుత్వాల పాత్రనే ఎక్కువగా ఉంటుంది. అందులో కొంత తోడ్పాటు, సహకారం స్వచ్ఛంద సంస్థలదీ ఉంటుంది. ఈ జిల్లాలో స్వచ్ఛంద సంస్థలది గణనీయమైన పాత్ర ఉందని చెప్పవచ్చు. అక్షరాస్యత పెంపొందించడం, నీటి సంరక్షణ పనులు చేపట్టడం, హెల్త్ ఎడ్యుకేషన్ సామాన్యుల వరకు చేర్చడం, పర్యావరణ పరిరక్షణలో జిల్లాలో ఎన్జీవోల పాత్ర చెప్పొకోదగిన విధంగా ఉంది.



వైవి.మల్లారెడ్డి

ప్ర : మీకు సంతృప్తిని కలిగించిన అంశాలేమిటీ ?

వైవి : ప్రజల్లో చైనత్య కల్పించే విషయంలో బాగా కృషి చేశాం. ప్రధానంగా అనంతపురం జిల్లా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ జిల్లాకు వాల్టా చట్టం తీసుకురావడంలో నా వంతు ప్రయత్నం చేయగలిగాను. స్వచ్ఛంద సంస్థల ద్వారా సేవలందించడమే కాకుండా తనకున్న సంబంధాల పరిధిలోనూ ప్రజలకు మేలు జరిగే కార్యక్రమాలను ప్రభుత్వపరంగా తీసుకురాగలిగాం. నీటి సంరక్షణ పనులు సుమారు వంద గ్రామాల్లో చేపట్టగలిగాం. వాటి ప్రయోజనాలు గ్రామీణ ప్రజానీకానికి అందుతున్నప్పుడు సంతోషం కలుగుతుంది. పది వేల మంది మహిళలకు జీవనోపాధులు కల్పించగలిగాం. మహిళలు ఆత్మస్థైర్యంగా బతికేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పించడంలో సఫలీకృతమయ్యాం.

ప్ర : ఇంకా చేయాలనుకున్న అంశాలేమిటి.?

వైవి : ఇంకాచేయాల్సింది చాలానే ఉంది. వినిమయ సంస్కృతిపై ఇప్పుడు ప్రధానంగా దృష్టి సారించాలి అనుకుంటున్నాం. వస్తు వ్యామోహం ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగింది. ఇది విపరీత ధోరణలకు దారితీస్తోంది. మానవ సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. అందుకే ఈ రంగంలో రాబోయే రోజుల్లో పనిచేయాలని భావిస్తున్నాం. అమతత్వం అన్న పేరుతో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్నా.

గంజాయి రహిత అనంతగా మారుద్దాం

◆ శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి

◆ 'వి రన్ ఫర్ అనంతపురం'

◆ ఉత్సాహంగా పాల్గొన్న యువత



వి రన్ ఫర్ అనంతలో పాల్గొన్న ఎమ్మెల్యే, శాప్ ఛైర్మన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతను గంజాయి, డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని శాప్ ఛైర్మన్ రవి నాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్‌లు పిలుపునిచ్చారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్), యాంటీ నార్కోటిక్స్ పోలీస్ విభాగం "ఈగల్", అహుడా, వి వైబ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'వి రన్ ఫర్ అనంతపురం' కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట నుంచి 10కె, 5కె, 3కె రన్‌లు ప్రారంభం అయ్యాయి. యువత, విద్యార్థులు, క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు విభాగాల్లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు శాప్ ఛైర్మన్ రవి నాయుడు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అహుడా ఛైర్మన్ వరుణ్, నిర్వాహకురాలు సజ్జ రాగవీణ, అడిషనల్ ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి రహిత రాష్ట్రంగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దుతోందన్నారు. గత ప్రభుత్వంలో విచ్చలవిడి తనంతో డ్రగ్స్ ప్రభావం ప్రజలపై పడిందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అందరి సహకారంతో అనంతపురంలో డ్రగ్స్ మహమ్మారి నివారణ సాధ్యం అవుతుందన్నారు. యువత దీనిపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతపురం జిల్లాను క్రీడా హబ్‌గా మారుస్తామని తెలిపారు. గంజాయి కట్టడికి అనంతపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కృషి చేస్తుందని అహుడా ఛైర్మన్ టిసి. వరుణ్ తెలిపారు. అనంతరం రన్ కార్యక్రమంలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి డా॥కరణం సుధాకర్, ఎస్‌వియు ఎన్ఎస్ఎస్, మీడియా కోఆర్డినేటర్ డా॥పాకనాటి హరికృష్ణ, జిల్లా క్రీడ అధికారి ఉదయ్ భాస్కర్, డా॥మహేంద్ర చౌదరి, హైదరాబాద్ చెఫ్స్ అదినేత సందీప్ చౌదరి, అర్బన్ టెక్ తేజా రెడ్డి, తెలుగు యువత తానికొండ రంజిత్, బాల లోకేష్ యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ బాలరాజు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, పద్మశాలి ఫెడరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక ఫెడరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, రాయలసీమ బలిజ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆటో కార్మికుల ఉపాధికి గండి కొడుతున్న రాపిడో సర్వీసులను జిల్లాలో నిషేధించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు ఆటో కార్మికులు, డ్రైవర్లు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని సిఐటియు నగర కార్యదర్శులు వెంకట్‌నారాయణ, ముర్తుజా, భగత్ సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, ఎన్టీఆర్ సీనా, షేక్ ఆజాంబాషా, ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాపిడో సర్వీసింగ్ నిషేధించాలని కోరుతూ సిఐటియు భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన పాదయాత్ర ప్రచార కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. సమస్య పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం నగరంలోని కృష్ణ కళామందిరం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

రైఫిల్ షూటింగ్‌కు ప్రోత్సాహం అందించండి

ఆర్యన్ అకాడమీ ఫౌండర్ శ్రీకాంత్



శాప్ ఛైర్మన్‌కు బొకే అందిస్తున్న ఆర్యన్ అకాడమీ సభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రంలో రైఫిల్ షూటింగ్‌కు ప్రోత్సాహం అందించాలని ఆర్యన్ షూటింగ్ అకాడమీ నిర్వాహకులు శ్రీకాంత్ కోరారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ రవినాయుడును రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైఫిల్ షూటింగ్‌కు ప్రోత్సాహం అందించాలని, అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షూటింగ్ అకాడమీ విద్యార్థులు తీక్షణ్‌సాయి, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచులకు గౌరవ వేతనం మంజూరుపై హర్షం

బ్రహ్మసముద్రం : రాష్ట్రంలోని సర్పంచులకు గౌరవ వేతనం మంజూరు చేయడం సంతోషకరమని సర్పంచి మల్లెల వనితా మల్లికార్జున హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని ఎస్.కొండాపురం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సర్పంచుల బాధలు, కష్టాలను దృష్టిలో ఉంచుకు వేతనాల విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్కరూపాయి కూడా విడుదల కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఏదిఏమైనా సర్పంచులకు జనరల్ ఫండ్స్‌లో గౌరవ వేతనంతోపాటు, ప్రొఫెషన్ టాక్స్, ఫర్ క్యాపిట్ నిధులు జమ చేయడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇందుకు సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించి కృతజ్ఞతలు తెలిపారు.

16న మెగా వైద్యశిబిరం

పామిడి : పామిడి లయన్స్ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అనంతపురం ఆధ్వర్యంలో ఈనెల 16వతేదీన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లపాటి తిరుపతి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేయనున్న వైద్యశిబిరంలో కంటిలో శుక్లాలు ఉన్నవారికి పరీక్షలు, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం సిటీ : సావిత్రీబాయి పూలే మహిళా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి విజయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగాడి శోభామణి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షురాలు విడి పద్మజ, మండల ప్రధాన కార్యదర్శి లతాదేవి, ఎం.విజయలక్ష్మి, భారతి, మహిళా ఉపాధ్యాయినీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



అక్షరాభ్యాసం చేయిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో ఆదివారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మాఘమాసం ప్రారంభంలో వచ్చే పంచమి రోజును సరస్వతీదేవి జన్మదినోత్సవంగా జరుపుకుంటామన్నారు. ఇందులో భాగంగా కొంతమంది విద్యార్థులకు పాఠశాల ఆవరణలో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ తబస్సుం, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఇర్షాద్, ఎఒ గోపాల్, డీన్లు సిరాజుద్దీన్ అప్పలనాయుడు, ప్రైమరీ భారతి, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో..

నగరంలోని ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి సరస్వతీమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం వసంతపంచమి విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.వరప్రసాద్, సాంస్కృతిక శాఖ అధిపతి అంకే ఆదెప్ప, హిందీ శాఖ అధ్యక్షులు శ్రీనివాసులు, తెలుగు శాఖ అధ్యక్షులు మురళీధర్, ఎఒ శ్రీనాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్వి డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు

భక్తులతో కిటకిటలాడిన అశ్వర్థం

పెద్దపప్పూరు : మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం పుణ్యక్షేత్రమంతా భక్తులతో కిటకిటలాడింది. శనివారం అర్ధరాత్రి నుంచే భక్తులు భారీగా తరలివచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా శ్రీచక్ర భవాని భీమలింగేశ్వర, అశ్వర్థ నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివార్ల దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు బారులుదీరారు. భక్తులు నది ఒడ్డున కొత్త కుండల్లో పాలు పోసి పొంగుబాలు పెట్టి స్వామివార్లకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా ఎక్కడికక్కడ భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా పోలీసులు మైకుల ద్వారా అప్రమత్తం చేశారు. ఆర్టీసీ అధికారులు తాడిపత్రి నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపారు.

వైసిపి కార్పొరేటర్ బాలాంజినేయులు టిడిపిలో చేరిక

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. నగరంలోని 19వ డివిజన్ కార్పొరేటర్ బాలాంజినేయులు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈయనకు ఎమ్మెల్యే దగ్గుపాటి, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలాంజినేయులు మాట్లాడుతూ నగరంలోని ఎమ్మెల్యే దగ్గుపాటి చేస్తున్న అభివృద్ధి చూసి టిడిపిలో చేరినట్లు తెలిపారు. అంతేగాకుండా టిడిపిలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. బాలాంజినేయులుకు టిడిపిలో మంచి గుర్తింపు ఉంటుందని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ తెలిపారు.

ఆర్ఇఎఫ్ జిల్లా కన్వీనర్‌గా టి.రాజారమేష్

అనంతపురం కలెక్టరేట్ : రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్‌గా టి.రాజా రమేష్‌ను నియమించినట్లు ఆర్ఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోతుల నాగరాజు, రాష్ట్ర కన్వీనర్ నారాయణ నాయక్ తెలిపారు. ఆదివారం ఆర్ఈఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటిని ఎన్నుకున్నారు. ఆర్ఈఎఫ్ జిల్లా కన్వీనర్ టి.రాజా రమేష్, రాష్ట్ర కో కన్వీనర్లు జి.శ్రీనివాసులు, మర్రిస్వామి, మావిటి శ్రీరాములు, రాయలసీమ కో కన్వీనర్ డి.వరదరాజులు, జిల్లా కో కన్వీనర్ స్వరూప్‌లను ఏక గ్రీవంగా నియమించినట్లు వారు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా అనంతపురంలోని నిస్సహాయకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వాణిశ్రీ, బద్రీనాథ్ కుమార్తె మేఘన పుట్టినరోజున పురస్కరించుకుని దుప్పట్ల పంపిణీకి సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ, శివరాజప్రసాద్, మనోజ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



బాధితుడికి పింఛన్ అందజేస్తున్న విఆర్ఓ

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామానికి చెందిన డయాలసిస్ రోగి మూగప్పగారి నాగయ్యకు మంజూరైన రూ.10వేల పింఛన్‌ను చింతకాయమంద విఆర్ఓ నరసింహులు ఆదివారం తిరుపతికి వెళ్లి అందజేశారు. నాగయ్య కొంతకాలంగా డయాలసిస్‌తో ఇబ్బంది పడుతూ తిరుపతి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న విఆర్ఓ తిరుపతికి వెళ్లి బాధితుడికి పింఛన్ సొమ్ము అందజేశారు.

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సిపిఎం నిరసన



గుంతకల్లుతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజల మరోసారి మోసం చేయడాన్ని వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యవర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సాకే నాగరాజు మాట్లాడుతూ పార్లమెంటులో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎపికి మొండిచేయి చూపించిందన్నారు. ముఖ్యంగా ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యాసంస్థకూ కేటాయింపులు చేయలేదన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిపుల్ ఐటి, ఐఐఎస్, గిరిజన యూనివర్శిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసేలేదన్నారు. రాజధాని నిర్మాణానికి గతంలో ప్రకటించిన ప్రపంచ బ్యాంక్ రుణాన్నే పదే పదే ప్రస్తావించారన్నారు. అంతేతప్ప కొత్తగా కేటాయింపు లేదన్నారు. గత బడ్జెట్‌లో రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను వెనుకబడిన ప్రాంతాలగా గుర్తించినా ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను కూడా కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపిలు కేంద్రాన్ని నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యుడు సురేంద్ర, నాయకులు షాబీర్, చంద్ర, ఓబులేసు, సూరి, రామునాయక్, నాగార్జున, ఎర్రిస్వామి, వెంకీ, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల సెక్రటరీ కుళ్లాయప్ప మాట్లాడుతూ కేంద్ర మంత్రి నిర్మలసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపడం బాధాకరమన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా కూటమిలోని టిడిపి, జనసేన నాయకులు చూస్తూ ఊరుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పెద్ద పుల్లయ్య, నాయకులు ఎర్రన్న, అంకాలు, తదితరులు పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీ ఎత్తేయాలి

ఐఎంఎ రాష్ట్ర కమిటీ సభ్యుడు డాక్టర్ ఆదర్శరెడ్డి



మెడికల్ రెప్‌ల జిల్లా కమిటీ నాయకులతో రాష్ట్ర కమిటీ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజలకు ఆరోగ్య అవసరాల వైద్య మందుల ధరలు తగ్గించి పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కమిటి సభ్యుడ డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, మెడికల్ సేల్స్ రెప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ అన్నారు. ఆదివారం ఏపి ఎంఎస్ఆర్‌యు ఆధ్వర్యంలో హెచ్ఎల్‌సి మెడికల్ హాల్‌లో వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఎంఏ రాష్ట్ర కమిటి సభ్యులు డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, సేల్స్ రెప్స్ యూనియన్ కన్వీనర్ శ్రీరాములు, రాష్ట్ర కమిటి సభ్యులు సురేంద్ర గుప్తా హాజరై మాట్లాడారు. ఫార్మా కంపెనీల ఆగడాలను అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలన్నారు. లేబర్ కోడ్‌లను ఉప సంహరించాలని కోరారు.

ఎపి ఎంఎస్ఆర్‌యు నూతన కార్యవర్గం ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రెప్రజెంటేటీవ్‌ల యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు మనోహర్ తెలిపారు. ఎపి ఎంఎస్ఆర్‌యు జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి విజయ నాయుడు, ఉపాధ్యక్షులు మంజునాథ్, నరేంద్ర, ఉప కార్యదర్శులు కదిరప్ప, రామాంజినేయులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'పది' మోడల్ పరీక్ష



గుత్తిలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని శ్రీ సాయి జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతమ్మ మోడల్ పరీక్ష పేపర్లను విడుదల చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, పాఠశాల కరస్పాండెంట్లు జయరంగారెడ్డి, కాంతరెడ్డి, కెఎస్‌కె ట్యూషన్ నిర్వాహకుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఈ మోడల్ పరీక్ష పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఇలాంటి మోడల్ పరీక్షలను ఉపయోగించుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు బాలాజీ, నాయకులు నవీన్ యాదవ్, సాయి, జిలాన్‌బాషా పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని కరణం చిక్కప్ప హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు మాదిరి పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, యుటిఎఫ్ జోనల్ కార్యదర్శి, చిత్తప్ప, యుటిఎఫ్ మండల కోశాధికారి రాజన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలంటే భయం పోగొట్టాలన్న ఉద్దేశంతోనే మాదిరి పరీక్ష నిర్వహినంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ధనుష్, అరవింద్, పట్టణ ఉపాధ్యక్షుడు ఆదర్శ్, పవన్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి

ప్రజాశక్తి-తాడిపత్రి

పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి పిలుపునిచ్చారు. ప్రేరణ-శిక్షణ తరగతుల్లో భాగంగా బిసి సంక్షేమ శాఖ డివిజన్ అధికారిణి రంగమ్మ అధ్యక్షతన ఆదివారం తాడిపత్రి డివిజన్‌లోని బిసి సంక్షేమ శాఖ హాస్టళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 17వతేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. పరీక్షలకు సమయాన్ని వృథా చేయకుండా బాగా చదువుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను డివైజ్ చేస్తుండాలన్నారు. తాము కచ్చితంగా పాస్ అవుతామని నమ్మకంతో ఉండాలన్నారు. మంచి ఆలోచన ఉండాలన్నారు. ఎవరి కోసమో కాకుండా మీకోసం మీరు కష్టపడాలన్నారు. మీ తల్లిదండ్రులకు చదువు విలువ బాగా తెలుసు కాబట్టి వారు కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా చదువును మానుకోకూడదన్నారు. రోజూ న్యూస్‌పేపర్లు, పుస్తకాలు చదవడం వల్ల జనరల్ నాలెడ్జ్ పెరుగుతుందన్నారు. పదో తరగతి తర్వాత చదివే చదువులు మీ జీవితానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులను బాగా చదివించడం మా బాధ్యత అన్నారు. ఏదైనా అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అనంతరం అనంతరం క్రియేటర్ కష్ణ విద్యార్థులకు పరీక్షలపై ఉండే భయాన్ని పోగొట్టేలా వారిలో చైతన్య పరుస్తూ ప్రేరణ కలిగించారు. అలాగే గణితము, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులపై ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి ఎంఈఓ నాగరాజు, బిసి హాస్టల్స్ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మస్తాన్, డివిజన్ పరిధిలోని వార్డెన్లు, సిబ్బంది, పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు అభినందనలు

కళ్యాణదుర్గంరూరల్ : మోడల్ డీఎస్సీ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు బద్దేనాయక్ ఆదివారం అభినందనలు తెలిపారు. ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జనవరి 19న నిర్వహించిన డీఎస్సీ మోడల్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మోడల్ డీఎస్సీ పరీక్షలు బోయ వీణ (వాల్మీకి) మొదటి ర్యాంకు, జె.జ్యోతి రెండో ర్యాంకు, ఎన్.తిమ్మప్ప మూడో ర్యాంకు సాధించారు. దీంతో ఆయా అభ్యర్థులను బద్దేనాయక్ అభినందించారు. త్వరలో ఆయా అభ్యర్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం : నగర సమీపంలోని సెంట్రల్ పార్కులో ఉన్న శిల్పారామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఇందులో భాగంగా నృత్య కళాకేంద్రం నృత్య గురువు సంధ్యామూర్తి బృందం భరత నాట్యాన్ని ప్రదర్శించింది. ఈ కార్యక్రమంలో నృత్య కళాకారులు నితీష, నివాన్వి, భార్గవి, దీక్షిత, హర్షవర్ష, మాన్విత, వైష్ణవి, హిమ వర్ష, మేఘన, వేదాన్విత, దర్శిని, హిమశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

శింగనమల : ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పుడు.. వేల గొంతులు' కార్యక్రమానికి జిల్లానుంచి భారీగా తరలిరావాలని ఎంఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి మొండిపోగుల ఎర్రిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా మాదిగలు, మాదిగ ఉపకులాలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

రాయదుర్గం-తుమకూరు రైలుమార్గం నిర్మాణానికి రూ.434.85 కోట్లు

రాయదుర్గం : నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం బడ్డెటల్‌లో రాయదుర్గం-తుమకూరు రైలుమార్గం నిర్మాణానికి రూ.434.85 కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులతో దొడ్డహళ్లి నుండి పావగడ మీదుగా మడకశిర వరకు 38 కిలోమీటర్ల రైలుమార్గాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం 206.5 కిలోమీటర్లకు ఇప్పటి వరకూ 103 కిలోమీటర్లు పూర్తికాగా రాబోయే మూడేళ్లలో మిగిలిన మొత్తం రైలు మార్గాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కొంతకాలం క్రితం కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి వి.సోమన్నను విప్ కాలవ శ్రీనివాసులు తుమకూరులో కలిసి రైలు మార్గం నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని, రాయదుర్గంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, రైల్వేస్టేషన్లలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరిన విషయం పాఠకులకు విధితమే. ఈనేపథ్యంలో రాయదుర్గం-తుమకూరు రైలుమార్గం నిర్మాణానికి తగిన ప్రాముఖ్యత ఇచ్చి నిధులు కేటాయించడంపై శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్ : జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున



ప్రజాశక్తి-రాయదుర్గం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి తీరని అన్యాయం జరిగిందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు వంటి వాటికి ప్రాధాన్యత లభిస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. ముఖ్యంగా విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటి, ఐఐటి, ట్రిబుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, కడప స్టీల్ ప్లాంట్, వెనుకబడిన జిల్లాలకు నిధులు, రాజధాని నిర్మాణానికి సంబంధించిన నిధులపై ఎక్కడా ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. దీనిపై నిలదీయాల్సిన బిజెపి కూటమిలోని టిడిపి, జనసేన పార్టీ నాయకులు నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

నిరుద్యోగులకు నిరాశ : డివైఎఫ్ఐ



అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర బడ్జెట్ దేశంలోని నిరుద్యోగులకు నిరాశాజనకంగా మారిందని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎస్.నూరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ నిరుద్యోగులకు తీవ్ర నిరాశ మిగిల్చిందన్నారు. ప్రధానంగా పరిశ్రమల ఏర్పాటు ప్రస్తావన ఎక్కడా లేదన్నారు. విభజన హామీ కడప ఉక్కు పరిశ్రమకు మొండిచేయి చూపించిందన్నారు. బీమారంగంలో పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయం భవిషత్‌లో తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్సిటీకి అన్యాయం చేశారని తెలిపారు. కడప ఉక్కుకు సంబంధించి రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చెప్పాడతామన్నారు.

నటరత్న బీసీ కృష్ణ మృతికి నివాళి

పామిడి : నటరత్న బీసీ కృష్ణ మృతి పౌరాణిక రంగస్థలానికి తీరనిలోటని పామిడి స్వరరాగ నాటక కళా సమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షులు దేవరాజు, గౌరవాధ్యక్షుడు పుంజా కృష్ణారావు అన్నారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెస్త సుబ్రమణ్యం, ఆంథోని, కదిరిపల్లి నాగార్జున, బెస్త ఓబులేసు, హనుమంతురెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

యాడికి : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూలులో 1981-1982లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందులో భాగంగా అప్పుడు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఇప్పటి హెచ్ఎం నాగన్నను ఘనంగా సత్కరించారు. తర్వాత ఒకరినొకరు బాగోగులు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ రామ్మోహన్, గంగాధర్, శశిధర్, విజయభాస్కర్, నరసింహమూర్తి, భోగేశ్వర్‌రెడ్డి, వనజ, నారమ్మ, లక్ష్మి, రాజేశ్వరి, స్వర్ణమంజుల, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలు విడుదల

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ ఆదివారం విడుదల చేశారు. ఈనెల 6 నుంచి 14వ తేదీ వరకూ స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. 12న రథోత్సవం (తిరుణాల) నిర్వహించనున్నట్లు ఆలయ ఇఒ సి.రామాంజినేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు కార్యాలయానికి శంఖుస్థాపన

నార్పల : మండల కేంద్రంలో శివకృష్ణ ఛారిటబుల్ ట్రస్టు కార్యాలయం నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షులు మెల్లంపూటి సూర్యప్రకాష్, ట్రస్టు ప్రతినిధి కొండిశెట్టి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు లగినేని నాగరాజు, బాబాఫకృద్దీన్, శాంతప్రకాష్‌రెడ్డి, పసుపులేటి లక్ష్మీనారాయణ, ఈడిగ శ్రీధర్, బుడెన్ ఖాన్, ఇండ్ల రంగనాథ్, విశ్వనాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, రాము, గూగూడు లక్ష్మిరెడ్డి, ఎల్లుట్ల శ్రీనివాసులు, బింగి తిరుపతయ్య, గొల్ల చంద్ర, తుంపెర నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : క్యాన్సర్ వ్యాధితో మృతిచెందిన మండల పరిధిలోని తరిమెల గ్రామానికి చెందిన వీరశేఖర్ కుటుంబానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బెస్త నారాయణస్వామి, మహేష్, కుమార్, రంగస్వామి, పుల్లయ్య, కత్తి నారాయణస్వామి, సోములి, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ

రాయదుర్గం : గుమ్మగట్ట మండలంలోని రంగచేడు గ్రామంలో ఏర్పాటు చేసిన మహర్షి వాల్మీకి విగ్రహాన్ని విగ్రహాన్ని ఆర్టీసీ రాయలసీమ రీజినల్ (కడప జోనల్) ఛైర్మన్ పూల నాగరాజు ఆదివారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, వాల్మీకి సోదరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

108 సిబ్బంది, పోలీసుల మానవత్వం

కొండలో వ్యక్తి మృతి-మోసుకూంటూ తీసుకొచ్చిన వైనం



మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు, 108 సిబ్బంది

శింగనమల : దైవదర్శనం కోసం మండల పరిధిలోని రుష్య శృంగముని కొండపైకి వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది, మండల పోలీసులు కొండపై నుంచి వ్యక్తి మృతదేహాన్ని డోలీలో మోసుకుంటూ కిందికి తీసుకొచ్చి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అనంతపురంలోని గుల్జార్‌పేటకు చెందిన డొల్ల ప్రకాష్ (67) తన భార్య, అన్న కుమారుడితో కలిసి మండల కేంద్రం సమీపంలోని కొండలో వెలసిన రుష్య శృంగముని స్వామి దర్శణానికి వచ్చాడు. కొండ ఎక్కుతుండగా మార్గమధ్యలో ఆయాసంతో గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న శింగనమల పోలీసులు రామాంజనేయులు, నరేష్, సాయి, 108 పైలెట్ శివయ్య, టెక్నీషియన్ కేశవ కొండపైకి ఎక్కి ప్రకాష్ మృతదేహాన్ని అతికష్టం మీద డోలీ ఏర్పాటు చేసుకుని నడక ద్వారా కిందికి తీసుకొచ్చారు. పోలీసులు, 108 సిబ్బంది చాటుకున్న మానవత్వాన్ని చూసి స్థానికులు ప్రశంసల జల్లులు కురిపించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు..తప్పిన ప్రమాదం



డివైడర్‌ను ఢీకొన్న బస్సు

పెద్దవడుగూరు : మండలంలోని వీరేపల్లి సమీపంలో ఉన్నవంతెన వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు డివైడర్‌ను ఢీకొంది.. అయితే ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పెద్దప్రమాదం తప్పినట్లయింది. గుత్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడిపత్రి నుంచి గుత్తివైపు వస్తున్న తరుణంలో ఇక్కడకు రాగానే బస్సు క్లచ్‌ప్లేట్లు సరిగాలేనందున అదుపు తప్పి డివైడరును ఢీకొంది. దీంతో కండక్టరు రమేష్‌తోపాటు బస్సులో ప్రయాణించే ఓ చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అప్పేచెర్ల వద్ద ఫికెట్‌లో ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను సురక్షితంగా బయటకు రప్పించి ఇతర వాహనాల్లో గుత్తికి తరలించారు. జరిగిన ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

కందిపంటకు నిప్పు

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం గ్రామానికి చెందిన కురుబ బ్యాకుల వెంకటేష్ ఐదెకరాల్లో సాగు చేసిన కంది పంట ఆదివారం దగ్ధమైంది. గుర్తు తెలియని దుండగులు పంటకు నిప్పు పెట్టడంతో పూర్తిగా కాలి బూడిదైంది. దీంతో సుమారు రూ.3లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.